సాక్షి కర్నూలు
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



పాచి పట్టిన కోనేరు మెట్లు

మహానంది: అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో మహానంది క్షేత్రంలోని కోనేరు మెట్లు పాచిపట్టి పోయాయి. స్నానం చేసేందుకు ఇందులో దిగుతున్న భక్తులు జారిపడిపోతున్నారు.



ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

సహజ వనరులను టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల కొండకు గుండుకొడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.88
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.304
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 27,861
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:26,478

న్యూస్‌రీల్

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కర్నూలు(అర్బన్): కేంద్రీయ సైనిక్ బోర్డు, రక్షణ శాఖ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు చేస్తున్న మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్‌ఆర్ రత్నరూత్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు ప్రధానమంత్రి ఉపకార వేతన పథకం ద్వారా ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన మాజీ సైనికుల పిల్లలు వెబ్ అడ్రస్ www.krb.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే నవంబర్ 30లోగా నిర్ణీత దరఖాస్తులను పంపాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

కర్నూలు(న్యూసిటీ): రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జెల వెంకటలక్ష్మి గురువారం కర్నూలు రానున్నట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా స్థాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

సీహెచ్‌సీల్లో 24 గంటల వైద్య సేవలు

సి.బెళగల్: జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో (కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో) 24 గంటల పాటు అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ తెలిపారు. సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌సీలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సి.బెళగల్ పీహెచ్‌సీలో కాన్పులను ఎక్కువ సంఖ్యలో చేస్తుండటంపై డాక్టర్ మిథున్‌రెడ్డిని, ఎంఎల్‌హెచ్‌పీ శిల్పను, ఇతర వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో (పీహెచ్‌సీలలో) 24 గంటలు మాతృ సంబంధ వైద్య సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది కొరతను త్వరలో తీరుస్తామని చెప్పారు. ఆయుష్ డాక్టర్ ప్రసాదరెడ్డి, పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం



అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ అమర వీరుల సేవలు చిరస్మరణీయమని ఆ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ అన్నారు. అటవీ శాఖ సర్కిల్ కార్యాలయంలో బుధవారం జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. చీఫ్ కన్జర్వేటర్‌తో పాటు డీఎఫ్‌వో శ్యామల, రేంజర్లు, అటవీ శాఖ ఉద్యోగులు అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ రామకృష్ణ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో 23 మంది అటవీ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అమరుల య్యారన్నారు. వారి సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్‌ఫారెస్ట్ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, ఎఫ్‌ఆర్‌వో విజయకుమార్, మేనేజర్ అబ్దుల్ సుభాన్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 14 మండలాలకు సంబంధించి రూ.28 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు కలెక్టర్ పరిపాలనా అనుమతులు ఇచ్చారని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నిధులతో మెటీరియల్ కాంపోనెంటు కింద మొదటి విడతలో ప్రతి మండలంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్స్ నిర్మించే విధంగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. తాజా కోడుమూరు, తుగ్గలి, కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, సీ.బెళగల్, గూడూరు మండలాల నుంచి రూ.14 కోట్లతో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. పరిపాలనా అనుమతుల కోసం ఈ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపినట్లు చెప్పారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి నిధులతో మొదటి విడతలో రూ.48 కోట్లతో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు.

కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నా సొంత జిల్లాలోనే మహిళలకు ఉపాధి కరువైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు అటకెక్కాయి. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదట్లో టీజీ అదిగో, ఇదిగో పరిశ్రమలని హడావుడి చేసినా.. ఆ తర్వాత మౌనం దాల్చడం గమనార్హం. ప్రభుత్వం ఏర్పాటయ్యాక రోజులు, నెలలు గడుస్తున్నాయే కానీ మహిళల ఉపాధి విషయంలో ఏ ఒక్కరూ నోరు మెదపని పరిస్థితి. ఇక ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ కూడా కాగితాలకే పరిమితమైంది.

ఉపాధి కరువై.. రుణాలు బరువై!



సోలార్ డ్రయ్యర్లు ద్వారా డీ హైడ్రేషన్ చేసిన ఉల్లి ఫ్లేక్స్

ఈఎంఐలు కట్టలేకున్నాం



సోలార్ డ్రయ్యర్లతో ప్రతి నెలా ఈఎంఐ చెల్లింపు పోను రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం ఉండేది. ఈ ఏడాది మే నెల నుంచి సోలార్ డ్రయ్యర్లు వినియోగంలో లేవు. టమాట/ఉల్లి సరఫరా ఆగిపోయింది. ఏడాదిలో అన్‌సీజన్ సమయంలో రెండు నుంచి మూడు నెలల పాటు రా మెటీరియల్ సరఫరా చేయడం జరుగదని చెప్పారు. ఇప్పుడు 5 నెలలు గడిచినా ఆ ఊసే లేదు. బ్యాంకు రుణాలతో సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేసుకున్నాం. మే నెల వరకు ఈఎంఐలు చెల్లించాం. ఆగస్టు నుంచి ఈఎంఐలు చెల్లించలేకపోతున్నాం. ఉపాధి లేకపోవడంతో మా బతుకు తలకిందులైంది. – అంజుమ్, పెద్దనెలటూరు, గోనెగండ్ల మండలం

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఉనికిని కోల్పోతున్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో కల్లూరు, గూడూరు, గోనెగండ్ల తదితర మండలాల్లో ఉల్లి, టమాట సోలార్ డ్రయ్యర్లు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 322 సోలార్ డ్రయ్యర్ల యూనిట్లు నెలకొల్పడం విశేషం. ఈ ఏడాది మార్చి వరకు ఈ యూనిట్‌లు పనిచేశాయి. ముంబయికి చెందిన ఎస్ 4 ఎస్ సంస్థ సహకారంతో సోలార్ డ్రయ్యర్లతో ఉల్లి, టమాట ఫ్లేక్స్ తయారు చేయడం ద్వారా మహిళలు ఉపాధి పొందారు. మామూలుగా అయితే ఏడాదిలో 10 నెలల పాటు సోలార్ డ్రయ్యర్లు పనిచేస్తాయి. మిగిలిన రెండు నెలలు అన్‌సీజన్ ఉండటంతో మార్కెట్‌లో టమాట, ఉల్లి కొరత ఉంటుంది. ఆ సమయంలో మాత్రమే సోలార్ డ్రయ్యర్లకు విరామం ఉంటుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి సోలార్ డ్రయ్యర్లు వినియోగంలో లేవు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు కాలం చెల్లినట్లయింది.

ఉపాధి మాటెత్తని ప్రభుత్వం

ఫ్లేక్స్ తయారీకి సీ, డీ గ్రేడ్ ఉల్లి, టమాట అవసరం. కొద్ది రోజులుగా టమాటకు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. ఈ సమయంలో సీ గ్రేడ్ టమాట సోలార్ డ్రయ్యర్లకు సరఫరా చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. టమాట ధరలు పడిపోయి అల్లాడుతున్నా... సోలార్ డ్రయ్యర్లు ఉన్నా ఆ దిశగా ఆలోచన కరువైంది. ఉల్లి ధరలు పెరిగినప్పటికీ సీ, డీ గ్రేడ్ రకాలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. అయినప్పటికీ మహిళలకు ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గతంలో చురుగ్గా పనిచేసిన ఎస్4ఎస్ సంస్థ కూడా చొరవ చూపకపోవడం గమనార్హం.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు పాతర

- ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఉపాధి కోల్పోతున్న మహిళలు
- ఏప్రిల్ నుంచి పనిచేయని సోలార్ డీ హైడ్రేషన్ డ్రయ్యర్లు
- జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి
- కేంద్ర పథకంతో కూటమి ప్రభుత్వ ప్రచారం
- ఆచరణలో కనిపించని ఉమన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్



నిరుపయోగంగా సోలార్ డ్రయ్యర్లు

అప్పులు చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి...

సోలార్ డ్రయ్యర్లు మూలన పడటంతో మహిళల పరిస్థితి దయనీయంగా మారింది. వీరిలో ఎక్కువ మంది పొదుపు మహిళలే. బ్యాంకు రుణంతో వీటిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతినెలా రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. నాలుగైదు నెలలుగా సోలార్ డ్రయ్యర్లు వినియోగంలో లేకపోవడంతో మహిళల పరిస్థితి దారుణంగా తయారైంది. మే నెల నుంచి ఈఎంఐలు చెల్లించలేక.. వడ్డీపై వడ్డీ, అపరాధ వడ్డీ కూడా పడుతోంది. బ్యాంకర్లు రుణాల రికవరీ పేరిట ఒత్తిడికి గురి చేస్తుండటంతో మహిళలు మానసిక వేదనకు లోనవుతున్నారు.

లఖ్‌పతి దీదీని వాడుకుంటున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తున్నా మాటలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని చేపట్టింది. మహిళలను పారిశ్రామిక వేత్తలు(ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్)గా తీర్చిదిద్దాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దీనినే రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకోవడానికి చర్యలు తీసుకోవడం గమనార్హం. లఖ్‌పతి దీదీ కార్యక్రమానికి ఈ నెల చివరిలోగా అంటే 100 రోజుల్లోపు 2,875 మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది లఖ్‌పతి దీదీగా మార్పు చేయాలని, ఇందుకోసం రూ.39.79 కోట్లు వివిధ రూపాల్లో అందచేయాలని నిర్ణయించారు. 2025 మార్చిలోపు 5,750 మంది మహిళలను లఖ్‌పతి దీదీగా అభివృద్ధి చేయాలనేది కూటమి ప్రభుత్వ ఆలోచన. ఇందుకు రూ.80.50 కోట్లు రుణాల రూపంలో అందించనున్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ప్రధానమంత్రి ముద్రా యోజన కింద రుణ సదుపాయం కూడా కల్పించనున్నారు. లఖ్‌పతి దీదీ కార్యక్రమానికి 100, ఏడాది అంటూ ప్రణాళికలు రూపొందించుకున్నా ఒక్కటీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

గత ప్రభుత్వంలో రూ.2వేల వరకు ఆదాయం

- 2023–24 వరకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మహిళలు పలు సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కింద సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్లతో పాటు ఇతరత్రా యూనిట్లతో రాణించేందుకు యువత ముందుకొచ్చింది.
- ఈ నేపథ్యంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచింది.
- రోజుకు రూ.1000 నుంచి రూ.2వేల వరకు ఆదాయం పొందేలా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చర్యలు చేపట్టింది.

కొంత సమయం పడుతుంది

జిల్లాలో త్వరలోనే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాం. సోలార్ డ్రయ్యర్లు ఈ ఏడాది మే నుంచి పని చేయడం లేదు. ఉల్లి ధర ఎక్కువగా ఉండటంతో సరఫరా చేయలేకపోతున్నారు. టమాటను వినియోగించేందుకు వాతావరణం అనుకూలంగా లేదు. సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఉల్లి, టమాట ఫ్లేక్స్ తయారీనే కాకుండా మొక్కజొన్న పౌడర్ కూడా తయారు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. వీటి ఏర్పాటుకు కొంత సమయం పడుతుంది. – ఉమాదేవి, ఈడీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

పల్లెల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కర్నూలు(అర్బన్): వర్షాల నేపథ్యంలో పల్లెల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు, ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మంగళ, గురు, శనివారాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు.

- దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఆయా గ్రామాల్లో కచ్చితంగా ఫాగింగ్ చేయాలన్నారు.
- ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు.
- ప్రతి గురువారం ఎస్‌డబ్ల్యూపీసీలకు చేరిన చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేయాలన్నారు.
- ప్రతి 15 రోజులకు ఒకసారి (12వ తేది నుంచి 15 లోగా, 27 నుంచి 30వ తేదిలోగా) ఆయా గ్రామాల్లోని డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు.
- పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమయ్యే వ్యయాన్ని 15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్ నుంచి వెచ్చించుకునే సౌలభ్యం ఉందన్నారు.
- ఇప్పటికే జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలకు రూ.31 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ అయ్యాయన్నారు.

సిలబస్ గందరగోళానికి తెర

- రెగ్యులర్ విద్యార్థులకు నూతన, పూర్వ విద్యార్థులకు పాత సిలబస్
- పది పరీక్షలపై స్పష్టతనిచ్చిన విద్యాశాఖ

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల సిలబస్‌పై నెలకొన్న గందరగోళంపై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తాజాగా మార్గదర్శకాలు జారీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో, సప్లిమెంటరీ పరీక్షలు మేలో జరుగుతాయని విద్యాశాఖ పేర్కొంది. 2024–25 విద్యా సంవత్సరం విద్యార్థులకు ఇప్పటికే సిలబస్‌ను మార్చిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే పాఠ్యపుస్తకాల ముద్రణ, పంపిణీ పూర్తయ్యింది. కొత్త సిలబస్ ప్రకారం నమూనా (మోడల్) ప్రశ్నపత్రాలను బీఎస్‌ఈఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ పోర్టల్‌లో విద్యాశాఖ పొందుపరిచింది. కాగా అంతకుముందు విద్యార్థులకు (ఫెయిలైన/పరీక్షలకు హాజరుకాని విద్యార్థులకు) మాత్రం పాత సిలబస్‌తోనే ప్రశ్నపత్రాలు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు. 2023–24, 2022–23, 2021–2022, అంతకు పూర్వం బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు మార్చి, మే–జూన్ వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన వారికి, రీఎన్‌రోల్/విత్‌హెల్డ్ /మాల్ ప్రాక్టీస్ విద్యార్థుల కు పాత సిలబస్‌లోనే పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ పేర్కొంది.



భారీగా తరలివచ్చిన జన సందోహం మధ్య ఆదోని పట్టణంలో శోభాయాత్ర, (ఇన్‌సెట్‌లో) ఆదోని సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువలో వినాయకున్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



శోభాయమానం

జిల్లాలో పలుచోట్ల బుధవారం గణేశ్ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. పట్టణాల్లో శోభాయాత్రలు రమణీయంగా సాగాయి. ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆన్‌లైన్ తూచ్.. ఆఫ్‌లైన్‌లోనే ఇసుక

- అమలుకు నోచుకోని ప్రభుత్వ ఆదేశాలు
- బుకింగ్ కేంద్రాల వద్ద రద్దీ
- ప్రజలకు తప్పని తిప్పలు



ఆఫ్‌లైన్‌లో ఇసుక రసీదులు ఇస్తున్న అధికారులు



సి.బెళగల్‌లోని ఇసుక బుకింగ్ కేంద్రం వద్ద గుమికూడిన ప్రజలు

సి.బెళగల్: ఉచిత ఇసుక అంటూ ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం, ఆన్‌లైన్‌లో బుకింగ్ అంటూ నమ్మబలికి మరోసారి మాట తప్పింది. బుధవారం నుంచి ప్రజలు ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో ఇసుకను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ మేరకు చర్యలు చేపట్టలేక చేతులెత్తేసింది. ఇసుక కావాల్సిన వారు ఆఫ్‌లైన్ బుకింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆగస్టు 28న జిల్లాలో రెండు బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సి.బెళగల్ గ్రామ సచివాలయం– 2, కర్నూలులోని జిల్లా మైనింగ్ కార్యాలయాల్లో ఇవి పని చేస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు సి.బెళగల్ గ్రామ సచివాలయం– 2కు రావాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని ఆదోని, కర్నూలు, పత్తికొండ రెవెన్యూ డివిజన్లతో పాటు, నంద్యాల జిల్లాకు చెందిన కొన్ని మండలాల నుంచి సైతం ఇసుక బుకింగ్‌కు ప్రజలు సి.బెళగల్‌కు వస్తున్నారు. రోజుకు ఒక్క వాహనానికి మాత్రమే పర్మిట్లు జారీ చేస్తుండటంతో రెండు ట్రాక్టర్ల ఇసుకను బుక్ చేసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖర్చులు తడిసి మోపడవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ మరింత జాప్యం

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ మరింత జాప్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఏపీ శాండ్ పోర్టల్‌లో బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలంటూ అధికారులు మధనపడుతున్నారు. తమకు ఎప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో నమోదు చెయ్యాలో అధికారులు ఎవ్వరూ చెప్పలేదని, ఎంత వరకు తాము బుకింగ్ కేంద్రాలలో ఉండాలో తెలియదంటున్నారు.

ఉద్యోగుల ఇక్కట్లు

ఇసుక ఆఫ్‌లైన్ బుకింగ్ కోసం మండల కేంద్రం సి.బెళగల్లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని గ్రామ సచివాలయం – 2ను ఎంపిక చేశారు. జిల్లాలో రెండో ఇసుక బుకింగ్ కేంద్రంగా ఉన్న సచివాలయానికి ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రజలు, వాహనదారులు, డ్రైవర్లు వస్తున్నారు. వీరిలో కొందరు నోట్లో గుట్కా నములుతూ, మద్యం తాగి అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. దీనితో సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది. సచివాలయ సేవలకోసం వచ్చే సాధారణ ప్రజలకు వీరి దారి ఇవ్వడంలేదు. వాహనదారులు, డ్రైవర్లు, యజమానులు వారి ప్రైవేట్ వాహనాలు, కార్లు, స్కూటర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణ నిండిపోతోంది. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. బుకింగ్ కేంద్రాన్ని మరోచోటికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ తీరు ఏమీ బాగోలేదు



ఇసుక బుకింగ్ కోసం ప్రతిరోజు ఇక్కడికి వచ్చిపోయేందుకే సరిపోతోంది. రోజు ఒక్క వాహనానికి మాత్రమే పర్మిట్లు ఇస్తున్నారు. ఇక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. కానీ అది ప్రారంభం కాలేదు. ప్రభుత్వ తీరు ఏమీ బాగోలేదు. – భాస్కర్, గోనెగండ్ల మండలం

ఆన్‌లైన్ బుకింగ్‌ను వెంటనే పెట్టాలి



ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కొన్నిరోజులు ఆఫ్‌లైన్‌లో రోజు ఒక్క ట్రాక్టర్‌కు మాత్రమే పర్మిట్ ఇస్తారని, తరువాత కొన్ని రోజులకు ఆన్‌లైన్‌లో ఇసుకను ఎక్కడి నుంచైనా బుక్ చేసుకోవచ్చని అన్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌ను వెంటనే చేపట్టాలి. – ఉరుకుందు, గుడేకల్ గ్రామం, ఎమ్మిగనూరు మండలం

ఖర్చు తడిసిమోపెడవుతోంది



ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం లేదు. మేం ఆఫ్‌లైన్ బుకింగ్ కేంద్రానికి రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. రోజూ పనులను మానుకుని ఇక్కడే ఉంటే ఒక్క ట్రాక్టర్‌కు పర్మిట్ దొరుకుతుంది. ఇక్కడి రావడానికి ఖర్చులు పెరిగిపోతున్నాయి. మొత్తంగా ఇసుక ఖర్చు తడిసిమోపెడవుతోంది. – శ్రీను, మాసుమాన్‌దొడ్డి

సాంకేతిక సమస్య వచ్చింది

బుధవారం నుంచి మొదలు కావాల్సిన ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ప్రక్రియ సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. మరో రెండు రోజుల్లో ప్రజలు ఇసుకను ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా బుక్ చేసుకోవచ్చు. – రాజశేఖర్, డీడీ, జిల్లా మైనింగ్ అధికారి



బనగానపల్లెలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



దోన్ పట్టణంలో శోభాయాత్రగా వెళుతున్న వినాయకులు





శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో.. (ఇన్‌సెట్) నంద్యాలలో కర్ర సాము విన్యాసాలు



కొత్తపల్లి మండలం ఎదురుపాడులో..



వినాయకా.. వీడ్కోలిక!

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడి చేరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కొన్ని పట్టణాల్లో, మరికొన్ని పల్లెల్లో బుధవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి బొప్పా మోరియా అంటూ మండపాల్లోని వినాయకులను కదిలించి.. వాహనాలపైకి చేర్చి శోభాయాత్రలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పు దరువుల మధ్య నృత్యాలు చేస్తూ పార్వతీ తనయుడికి నిమజ్జనం చేశారు. వేడుకల్లో పిల్లలు, పెద్దలు పాల్గొని గణేశుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

–సాక్షినెట్‌వర్క్



ఆదోని సమీపంలోని ఎల్లెల్సీలో గణేశ్ నిమజ్జన దృశ్యం



ఆళ్లగడ్డలో అమ్మవారి వేషధారణ



బనగానపల్లెలో కళాకారులు కోలాటం (ఇన్‌సెట్) కోసిగిలో వినాయకుడు



కోసిగిలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



ఆదోని వినాయక్ ఘాట్ వద్ద పూజల్లో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్



మహానందిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

క్లుప్తంగా

ఆలస్యమైనందుకు వివరణ

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ నెల 6వ తేదీన జిల్లా స్పెషల్ ఆఫీసర్ నరసింహారావు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే 8 మంది ఎంఈఓలు ఆలస్యంగా హాజరు అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు సదరు ఎంఈఓలపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ, తన ముందు నేడు(గురువారం) హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. కర్నూలు అర్బన్ ఎంఈఓ, వెల్దుర్తి, కృష్ణగిరి, మద్దికెర, పెద్దకడబూరు, గోనెగండ్ల, కౌతాళం, ఎమ్మిగనూరు మండలాలకు చెందిన ఎంఈఓలు డైరెక్టర్ ముందు హాజరుకానున్నారు.

చేపలు పట్టుకొనే విషయంలో మత్స్యకారుల వాగ్వాదం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద చేపలు పట్టుకొనే విషయమై బుధవారం మత్స్యకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. చాబోలు గ్రామానికి చెందిన సుధాకర్, భాస్కర్ హెడ్‌రెగ్యులేటర్ అధికారుల సహకారంతో గేట్లకు కుడి, ఎడమ గట్ల చివరన వలలు వేసుకొని గతపదేళ్లుగా చేపలు పట్టుకుంటూ జీవిస్తున్నారు. అయితే వారు అక్కడ చేపలుపట్టుకోరాదంటూ చాబోలు గ్రామానికి చెందిన కొంత మంది మత్స్యకారులు వాగ్వాదానికి దిగారు. తాము పదేళ్ల కాలంగా హెడ్‌రెగ్యులేటర్ గేట్ల వద్ద చేపలు పట్టుకుంటున్నామని తమ ఆరోగ్య, కుటుంబ పరిస్థితి బాగోలేదని వేడుకున్నా కనికరించకుండా తమ వలలు లాక్కోవడంతో పాటు ఆడవాళ్లను దూషించారని పేర్కొంటూ సుధాకర్, భాస్కర్‌లు జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ప్రాజెక్టుకు 100 మీటర్ల పరిధి వరకు ఎవరూ చేపలను వేటాడరాదనే నిబంధనలున్నాయి. అయితే గేట్ల వద్ద చేపలు పడుతున్నా ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

- కరిగిపోతున్న పూడిచెర్ల కొండ
- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- టీడీపీ నేతలే అక్రమార్కులు
- చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



గ్రీన్‌కో కంపెనీకి వెళ్లే మార్గంలో తవ్వకాలు

ఓర్వకల్లు: సహజ వనరులను టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఓర్వకల్లు మండలంలోని జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న పూడిచెర్ల కొండకు గుండుకొడుతున్నారు. నన్నూరు, పూడిచెర్ల, లొద్దిపల్లె, బైరాపురం, ఉయ్యాలవాడ, కొమ్ముచెరువు, కాల్వ గ్రామాల రెవెన్యూ పరిధిలోని కొండలు, గుట్టలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో ఎర్రమట్టి విస్తారంగా ఉండడంతో టీడీపీ నాయకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి, పట్టణ ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయాలు జరిపి సొమ్ముచేసుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ ,పోలీసు సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవడం లేదు. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

జోరుగా వ్యాపారం

నన్నూరు, లొద్దిపల్లె రెవెన్యూ పరిధిలోని ఎర్రమట్టికి డిమాండ్ పెరగడంతోనే అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇందులో నన్నూరు గ్రామ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్లు 863, 1192లలోని కలికుంట మొరుసును, లొద్దిపల్లె శివారులోని సర్వే నంబర్ 105లో అటవీ భూమిని వదలడంలేదు. ఆయా ప్రాంతాల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరిపి కర్నూలు నగరంలో ఇళ్ల నిర్మాణాలకు, వెంచర్లలో రోడ్ల నిర్మాణాలకు విక్రయించి భారీగా సొమ్ముచేసుకుంటున్నట్లు బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. ఉయ్యాలవాడ గ్రామ శివారులోని సర్వే నంబర్ 725లో ఇటీవల రామళ్లకోటకు చెందిన ఓ వ్యక్తి ఐరన్ ఓర్ మట్టిని తవ్వేందుకు జేసీబీతో వెళ్లగా, స్థానిక రైతులు ఎదురు తిరగడంతో అక్కడి నుంచి సదరు వ్యక్తి వెనుతిరిగి పోయినట్లు తెలుస్తోంది.

రోజూ వందల టన్నుల రవాణా

పూడిచెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని వందలాది ఎకరాల్లో విస్తరించిన సహజసిద్ధమైన కొండలు, గుట్ట లు తరగిపోతున్నాయి. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ టీడీపీ నేత ఎయిర్ పోర్టు నిర్మాణం పేరుతో అడ్డగోలు అనుమతులు పుట్టించి 55వ సర్వే నంబర్‌లో గల 45 ఎకరాల కొండను కొల్లగొట్టారు. అదేవిధంగా 372 సర్వేనంబర్‌లో దీర్ఘవృత్తాకారంలో వెలసిన కొండకు క్లాంవేసి క్రమంగా ఒకవైపు నుంచి తవ్వకాలు ప్రారంభించారు. ప్రస్తుతం గుట్టపాడు వద్ద నెలకొల్పుతున్న జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసమని అదే ప్రాంతంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలను కొనసాగిస్తున్నారు. రోజుకు వందల టన్నుల మట్టిని స్టీల్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు అభియోగాలు వస్తున్నాయి.



కొండలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

పుట్టుగొడుగుల పరిశ్రమకు మట్టి తరలింపు

ఇటీవల కాల్వ గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ స్థాయి నాయకుడు స్థానిక పుట్టగొడుగుల పరిశ్రమకు వందల టన్నుల మట్టిని తరలించి భారీగా సొమ్ముచేసుకున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. అదే గ్రామ రెవెన్యూ పరిధిలో గ్రీన్‌కో కంపెనీకి వెళ్లేదారిలో గల కొండకు తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తుంది. అదే మార్గంలో పుట్టగొడుగుల పరిశ్రమ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 618లో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు విస్తరణ పేరుతో కొండలో మట్టిని తవ్వి గ్రీన్‌కో కంపెనీకి తరలిస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. అదేవిధంగా గత టీడీపీ హయాంలో ఓ టీడీపీ నేత కొమ్ము చెరువు మట్టిని తవ్వి ఇటుకల బట్టీలకు విక్రయించి భారీమొత్తంలో సొమ్ముచేసుకున్నట్లు అభియోగాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు చొరవతీసుకొని అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టి, సహజ వనరులను కాపాడవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో లా 5,7,9 సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జరిగిన పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కర్నూలులోని ఉస్మానియా కళాశాల కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలకు 39 మంది విద్యార్థులకు 31 మంది హాజరయ్యారని తెలిపారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన బోయ లోకేష్ (34) ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకే హత్యకు గురయ్యాడని పోలీసులు తేల్చారు. ఘాతుకానికి పాల్పడిన అదే కాలనీకి చెందిన గాడి అశోక్‌కుమార్ అలియాస్ అశోక్, రెడ్డిపోగు జగదీష్ చంద్రబోస్ అలియాస్ జగదీష్‌లను సంతోష్‌నగర్ జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. వారిని విచారించగా లోకేష్‌ను హత్య చేసినట్లు అంగీకరించారు. కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన లోకేష్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో నిత్యం కుటుంబ సభ్యులను వేధించేవాడు. వేధింపులు భరించలేక భార్య మీనా కుమారుడిని తీసుకుని పుట్టినిల్లు కోడుమూరుకు వెళ్లిపోయింది. తల్లి కూడా నెల రోజుల క్రితం చనిపోవడంతో మతిస్థిమితం కోల్పోయిన లోకేష్ వీధుల్లో వీరంగం సృష్టించి అందరినీ భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఇతనిపై పోలీసులు గతంలో కేసు నమోదు చేసి విశాఖపట్నం మెంటల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈనెల 7వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన అశోక్ భార్య పట్ల లోకేష్ అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో నిందితులిద్దరూ కత్తులతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. లోకేష్ సోదరి హుసేనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో నిందితులను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ మధుసూదన్‌రావు తెలిపారు.

డిగ్రీ పూర్తి చేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2015, 2016, 2017, 2018 సంవత్సరాల్లో డిగ్రీలో చేరి ఫెయిలై, కోర్సు పూర్తి చేసుకోలేని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఆయా సంవత్సరాల్లో ఏ సెమిస్టర్, ఏ సబ్జెక్టులోనైనా ఫెయిలైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 10వ తేదీలోగా తగిన రుసుం చెల్లించి దరఖాస్తులను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్‌యూ నోటిఫికేషన్ను చూడాలని పేర్కొన్నారు.

విధులు వారిష్టం!

- 11 గంటలైనా హాజరుకాని సచివాలయ ఉద్యోగులు



ఉదయం 11గంటల సమయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామ సచివాలయం-1లో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. బుధవారం ఉదయం 11గంటలు అయినా విధులకు ఎవరూ హాజరు కాలేదు. వివిధ సమస్యల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు ఖాళీ కుర్చీలను చూసి వెనుతిరిగి వెళ్లారు. కొందరు ఆలస్యంగా వచ్చినా హాజరు వేసుకుని వెళ్లిపోతున్నారని, సచివాలయంలో ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ.. కచ్చితంగా విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రాణం తీసిన వేగం

- కారు బోల్తా పడి తెలంగాణ వాసి దుర్మరణం



సూర్య మృతదేహం

శిరివెళ్ల: అతివేగానికి ఒకరి ప్రాణం గాల్లో కలిసిపోగా మరో ఐదుగురిని స్వల్ప గాయాలతో బయటపడేసింది. ఈ ఘటన గోవిందపల్లె-కానాల మెట్ట మధ్య కర్నూలు-కడప జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మెదక్ మండల పరిధిలోని గౌతాపూర్ తండాకు చెందిన గుగ్లోత్ సూర్య (26), అతని భార్య మంజుల, డ్రైవర్ విష్ణు తోపాటు కుటుంబ సభ్యులు గణేష్, నిత్య, రాకేష్‌తో కలిసి ఈనెల 7న తిరుపతికి వేంకటేశ్వర స్వామి దర్శనం నిమిత్తం కారులో బయలు దేరారు. దర్శనం అనంతరం మంగళవారం(10వ తేదీ) సాయంత్రం తిరుపతి నుంచి స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. రాత్రి గోవిందపల్లె-కానాల మెట్ట మధ్య గణేష్ వే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే కారు వేగంగా వెళ్తూ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో కారు కింద పడి సూర్య అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఐదుగురు స్వల్ప గాయాలకు గురయ్యారు. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం వారు హైదరాబాద్‌కు వెళ్లారు. సూర్య మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

గౌతం.. లెయ్యిరా

- కుళాయి గుంతలో పడి చిన్నారి మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు



మృతిచెందిన బాలుడు



కుమారుడి మృతదేహాన్ని ఒడిలో పెట్టుకుని రోదిస్తున్న తల్లి

రుద్రవరం: ముద్దుముద్దు మాటలు..బుడిబుడి నడకలతో సందడి చేసే తమ కుమారుడు కుళాయి గుంతలో విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ దంపతులు రోదించిన తీరు పలువురిని కంట తడి పెట్టించింది. గౌతం.. లెయ్యిరా అంటూ గడ్డం పట్టుకుని తల్లి బ్రతిమిలాడుతున్న దృశ్యం కలిచివేసింది. మండల పరిధిలోని చందలూరు గ్రామానికి చెందిన సుబ్బయ్య, మహేశ్వరి దంపతులకు కుమారుడు గౌతం(4)తోపాటు ఓ కుమార్తె ఉంది. బుధవారం ఉదయం తోటి చిన్నారులతో కలిసి బాలుడు ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ఉండగా తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కాసేపటికి కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. సమీపంలోని కుళాయి కోసం తీసిన గుంతలో విగతజీవిగా పడి ఉండటం చూసి వెంటనే బయటకు తీశారు. అప్పటికే మృతిచెందాడని తెలుసుకుని ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి కిరణ్‌కుమార్

దొర్నిపాడు: రైలు నుంచి జారి పడి ఇంటర్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం ప్రకాశం జిల్లా వినుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన ఉషాకాంత్, మహేశ్వరి దంపతులకు కిరణ్‌కుమార్(17), ఉదయ్‌కుమార్ కుమారులు. పెద్ద కుమారుడు కిరణ్‌కుమార్ గుంటూరులోని కేం బ్రిడ్జి కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం (బైపీసీ) చదువుతున్నాడు. వినాయక చవితికి రెండు రోజులు సెలవులు రావడంతో స్వగ్రామానికి వచ్చాడు. పండుగా ముగించుకొని మంగళవారం రాత్రి నంద్యాల నుంచి గుంటూరుకు రైల్‌లో బయలు దేరాడు. ప్రయాణికులతో రైలు రద్దీగా ఉండటంతో డోర్ వద్ద నిలుచున్నాడు. ప్రకాశం జిల్లా వినుకొండ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే ప్రమాదవశాత్తూ రైల్‌లో నుంచి జారి కింద పడ్డాడు. తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. కుడి కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కావడం, తలకు బలమైన గాయాలు కావడంతో కదల్లేని స్థితిలో దాదాపు ఐదు గంటలపాటు నరకయాతన అనుభవించాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు గమనించి ట్రాక్టర్‌లో వినుకొండ వైద్యశాలకు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకునేలోపే కోలుకోలేక ప్రాణాలొదిలాడు. రైల్వేపోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా విద్యార్థి కిరణ్ మృతితో డబ్ల్యూ గోవిందిన్నెలో తీవ్ర విషాదం అలుముకుంది.